విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

శుక్రవారం 29 ఆగస్టు 2025 8 పేజీలు

బషీర్‌బాగ్ అమరవీరుల స్ఫూర్తితో

విద్యుత్ పోరాటానికి సన్నద్ధం కావాలి

- వామపక్షాల పిలుపు
- స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకునేంతవరకు ఉద్యమం ఆగదు
- ప్రజల పై భారాలు మోపటంలో చంద్రబాబు, జగన్ దొందు దొందే

విశాలాంధ్ర-ఒంగోలు: బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణలు విరమించుకుంటే ప్రజాగ్రహంతో ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినంలో భాగంగా ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి, సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జీ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 2000 సంవత్సరంలో బషీర్ భాగ్ వద్ద జరిగిన విద్యుత్ ఉద్యమంలో తనకు గాయాలయ్యాయి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నాటి విద్యుత్ ఉద్యమం తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోవడానికి శ్రీకారం చుట్టిందన్నారు. నీటి ఫిరంగులు ఒకవైపు, రబ్బరు బుల్లెట్లు ఒకవైపు దూసుకు వస్తున్నా ఏ మాత్రం లెక్కచేయకుండా వేలాది మంది కార్యకర్తలు గుండ్లకు గుండెను అడ్డుపెట్టి వీరోచిత మిగతా 2 లో ...

'రెడ్‌బుక్' ప్రజలిచ్చిందే

❑ మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర -ఒంగోలు: వైసీపీ పాలనలో ఇబ్బంది పడ్డ రాష్ట్ర ప్రజలు లోకేష్ కు ఇచ్చిన ఫిర్యాదులే రెడ్ బుక్ అని , ఇది తెలుగుదేశం పార్టీ వారు రాసుకున్న బుక్కు కాదని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం ఒంగోలుకు విచ్చేసిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి పాలనలో విసిగి వేసారి పోయిన ప్రజలు రెడ్ బుక్ రూపంలో తమ బాధలను, వైసీపీ వేధింపులను లోకేష్ బాబు ఎదుట ఏకరువు పెట్టారన్నారు.ఎవరైతే తప్పులు చేశారో, అవినీతికి పాల్పడ్డారో, వాటిల్లో ఇన్వాల్వ్ అయ్యారో వారే ఒక్కొక్కరుగా అరెస్టు అవుతున్నారన్నారు. వాడు చేసిన తప్పులు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఏది కోరి తెచ్చుకున్న శ్రీ లక్ష్మీ నే నేడు వారి నాయకులు విమర్శిస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలన ఎంత ఫెయిల్యూర్ అదే విషయం ఈ ఘటన ద్వారా తెలుస్తుంది అన్నారు. తమ పాలనలో అధికారులు పారదర్శకంగా పనిచేస్తున్నారన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా గుంతలు పూడ్చామని, సిమెంట్ రోడ్లు వేసామని, కేంద్రం నుండి అధిక నిధులు రాబట్టి పోలవరం నిర్మిస్తున్నామని, విశాఖ ఉక్కును నిలబెట్టుకున్నామని, రాయలసీమను అభివృద్ధి బాటలో పయనింప చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోగా డీఎస్సీ వెరిఫికేషన్

2లో

ప్రభుత్వ పథకాలకు అవసరమైన

భూములను గుర్తించాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రభుత్వ పథకాలకు అవసరమైన భూములను త్వరగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పాల్గొన్నారు. పీ. ఎం. కుసుమ్ సోలార్ విద్యుత్ ప్లాంట్స్, ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు భూముల గుర్తింపు, యూరియా లభ్యత - అపోహల తొలగింపు, పెన్షన్ల వెరిఫికేషన్ - అర్హులకు కొనసాగింపు, భూగర్భ నీటి మట్టం పెంపు, జిల్లా జువైనల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు, తదితర అంశాలపై సంబంధిత జిల్లాల వారీగా సీ.ఎస్. సమీక్ష నిర్వహించారు. అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. పెన్షన్ల వెరిఫికేషన్ పై అప్పీల్ చేస్తే, విచా రణ పెండింగ్లో ఉన్న వారికి కూడా సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆయన చెప్పారు. కాగా, పీ.ఎం.కుసుమ్ సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి భూముల గుర్తింపును వేగవంతం చేశామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. దొనకొండ మండలం బాధాపురం గ్రామంలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి 2149 ఎకరాల భూములను ఇప్పటికే గుర్తించామన్నారు. జిల్లాలో సాగుకు అవసరమైన స్థాయిలో యూరియా అందుబాటులో ఉన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఇరిగేషన్ ఎస్.ఈ.వరలక్ష్మి, డి.ఆర్.డి.ఏ. పి.డి. నారాయణ, ఐ.సీ.డీ.ఎస్. పీ.డీ. సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు వృధా కానివ్వం

- ❍ బషీరాబాగ్ అమరులకు ఘన నివాళులు
- ❍ స్మార్ట్‌మీటర్ల ఆలోచన విరమించుకోవాలి
- ❍ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర-చీరాల టౌన్ : చీరాల పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ లో వామపక్ష పార్టీలు, ప్రతిపక్ష పార్టీలు కలిసి 2000 సంవత్సరం ఆగష్టు 28వ తేదీన విద్యుత్ ఛార్జీల పెంపుకు వ్యతిరేక జరిగిన ప్రదర్శన సందర్భంగా షహీద్ చౌక్ (బషీరాబాగ్) వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్ మాట్లాడుతూ నాడు ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా వామ పక్షాల ప్రతిపక్షాల కార్యాచరణ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అయితే ఆ మహా ఉద్యమాన్ని అణిచి వేసేందుకు నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉద్యమ కారుల మీద తూటాలు పేల్చి ముగ్గురిని కాల్చి చంపి ప్రభుత్వం మారణ హోమం చేశారన్నారు. ఆనాటి నుంచి ఇప్పటివరకు కూడా విద్యుత్ సంస్కరణల ప్రభుత్వం చంపేసిన ముగ్గురిని అమరవీరుల స్థూపాన్ని దర్శించుకుంటూ వారికి సంతాపం తెలియజేస్తూ అనేక కార్యక్రమాలు ఉద్యమకారులు చేస్తూ ఉన్నారన్నారు. 25వ వర్ధంతి సందర్భంగా ఈనాటి పరిస్థితులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా మరో ఉద్యమం చేయాలని ఆలోచనతో నేడు రాష్ట్రంలో వాము పక్షాలు, ప్రతిపక్షాలు ఐక్యతగా కలిసి రాబోయే కాలంలో విద్యుత్ సంస్కరణ మీద స్మార్ట్ మీటర్లు బిగించాలని దురుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానంపై నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా 9 వామపక్షాల పార్టీలు కలిసి ప్రతిజ్ఞ దినం కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. అందులో భాగంగానే చీరాలలో వామపక్షాలతో ప్రజా మిగతా 2 లో ...

అమరవీరుల త్యాగాలు వృధా కానివ్వం

(మొదటిపేజీ తరువాయి)

సంఘాల నాయకులతో ప్రతిజ్ఞ దినం ఏర్పాటు చేశామన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాకముందు వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి, స్మార్ట్ మీటర్లు బిగించాలని ఆలోచన ప్రభుత్వం తీసుకొస్తే వామపక్షాలు ప్రజా సంఘాలు ఉద్యమాలు చేస్తే ఉద్యమకారులతో కలిసి తెలుగుదేశం పార్టీ కూడా మద్దతుగా నిల బడ్డారన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించటానికి వచ్చిన వారిని వ్యతిరేకించాలని నాడు పిలుపునిచ్చిన టిడిపి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు బిగించాలనుకోవడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలను, ట్రూ ఆఫ్ చార్జీలను పెంచి అబద్దాలు చెబుతున్న కోటమి ప్రభుత్వంపై ఉద్యమాలు, తిరుగుబాటు తీసుకువచ్చే విధంగా వామపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేస్తూ

మీ త్యాగాలను వృధా కానివ్వబోమని

మీరు చూపిన సమరశీల బాటలో రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్న మోదీ - ఆదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలు, పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ చీరాల నియోజకవర్గ కార్యదర్శి బాసి పైదయ్య, సిపిఐ మండల కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోగా డీఎస్సీ వెరిఫికేషన్

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో మోగా డిఎస్సీ వెరిఫికేషన్ చక్కగా నిర్వహించిందుకు జిల్లా విద్యాశాఖకు జిల్లా ఎస్టియు నాయకులు అభినంద నలు తెలిపారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా పూర్తి చేస్తున్న సందర్భంలో జిల్లాలో 585 మంది అభ్యర్థుల యొక్క సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఒంగోలు నందు శ్రీ సరస్వతి విద్య కేంద్రం నందు ఏర్పాటును జిల్లా విద్యాశాఖ నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా అభ్యర్థులకు వారితో పాటు వచ్చినటువంటి వారి తల్లి దండ్రులకు చక్కని వసతి భోజన ఏర్పాట్లను కల్పించి 13 కౌంటర్లలో అభ్య ర్థులకు ఎలాంటి అసౌకర్యం కల్పించకుండా చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్, జిల్లా పరిశీలకులుగా విచ్చేసిన తెహారా సుల్తాన్ తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పై అధికారులకు తెలియజేసి పరిష్క రించడం జరిగినది తెలిపారు. అలాగే వారికి సహకరించినటువంటి ఉప విద్యాశాఖ అధికారులు నాన్ టీచింగ్ సిబ్బందికి ఎస్టియు జిల్లా పక్షాన వారికి ప్రత్యేక అభినందనలు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే ఎర్రయ్య జి నరసింహారెడ్డి ఎస్ కే మౌలాలి అల్లూరయ్య తదితరులు జిల్లా విద్యాశాఖను అభినందించడమైనది. ఏదైనా పొరపాట్లు జరిగిన వాటిని డిఇఓ సత్వరమే పరిష్కరించి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చేయడమైనది.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 క్రింద ఖరీఫ్ సీజన్ లో సాగు చేసే పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి వీవీ శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, వరి, కంది, ప్రత్తి, మొక్కజొన్న, సజ్జ, మిరప తదితర పంటల్లో విత్తనం వేసే దగ్గర నుండి పంట కోత వరకు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, జీవన ఎరువుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం యాజమాన్య పద్ధతుల కరదీపికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, ఏఈఓ గణేష్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కేజీవీవీ అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో రూ 2 కోట్లు వ్యయంతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని కెజిబివి లో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం రూ 1.25 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను శనివారం శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు.

బషీర్‌బాగ్ అమరవీరుల స్ఫూర్తితో

విద్యుత్ పోరాటానికి సన్నద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

పోరాటం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరో విద్యుత్ పోరాటం పునరావృతం అయ్యే పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొన్నా యన్నారు. చంద్రబాబు నాయుడు, జగన్ ఇద్దరు ప్రజలపై భారాలు మోపటంలో దొందూ దొందే అన్నారు. దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్న చందంగా ప్రజలపై నేడు విద్యుత్ భారాలు మోపుతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ యువగళం, చంద్రబాబు నాయుడు పెద్దగళం పేరుతో స్మార్ట్ మీటర్లను పగలకొట్టండి అంటూ పిలుపు ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేడు అదే చంద్రబాబు నాయుడు స్మార్ట్ మీటర్ల బిగింపుకు, ట్రూ అప్ చార్జీ ల భారాలు మోపేందుకు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ప్రజలపై పోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈపాటి కే వామపక్ష పార్టీలు ఉద్యమ బాటలో ఉన్నాయని, ఎర్రజెండా నీడన మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు శంకర్ గిరి మాన్యాలు పట్టి పోవడం ఖాయమని హెచ్చరించారు. రూ. 175 కోట్లతో అమెరికాలో అదాని ఒప్పందం కుదుర్చుకున్న జగన్ను చంద్రబాబు నాయుడు ఎందుకు జైలుకు పంపలేకపోతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుకు దమ్ముంటే జగన్ను జైలుకు పంపాలని సవాల్ విసిరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు జీతగానిగా విద్యుత్ సంస్కరణలు తెచ్చిన చంద్రబాబు మరోసారి అదే దారిలో నడుస్తున్నాడని దుయ్య బట్టారు. కేంద్రం అండతో రాష్ట్రాన్ని ఆదానీ, అంబానీల అడ్డాగా మారుస్తు న్నాడని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని పిలుపు ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చి వాటినే అమలు చేయడం సిగ్గుచేటు అని విరుచుకుపడ్డారు. స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రభుత్వం స్పష్టంగా ఎందుకు చెప్పలేకపోతోందని ఆమె ప్రశ్నించారు.ఈ మౌనం వెనుక అదానీ, అంబానీ ప్రయోజనాలే ఉన్నాయని ప్రజలకు అర్థం అవుతోంది అని ఆరోపించారు. సూర్య ఘర్ పథకం పేరిట కోట్లాది రూపాయల డ్వాక్రా నిధులను మళ్లించే కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. చిన్న పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు తొలగించడం, విద్యుత్ సంస్థలను దివాళా తీయించి కార్పొరేట్లకు అప్పగించడం, అన్నీ కార్పొరేట్ల ప్రయోజనా కోసమే అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపు నిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ మాట్లాడుతూ గత పోరాట ఫలితంగా ప్రజలకు 20 ఏళ్ల నుండి విద్యుత్ భారాల నుండి ఉపశమనం లభించిందని, జగన్ ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలతో కొత్త సంస్కరణలు తెచ్చి పెట్టాడు అన్నారు. ఎన్నికలలో విద్యుత్ ఛార్జీలు పెంచబోకుని హామీ ఇచ్చి ఇప్పుడు మరోసారి సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు ఇంటి బాధ పట్టటం ఖాయమని ఘాటుగా వ్యాఖ్యానించారు.సిపిఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ అదానీతో రూ.1750 కోట్ల ఒప్పందం, మరోవైపు ప్రజలపై రూ.1.25 లక్షల కోట్ల భారం ఇది ప్రభుత్వానికి సులభమా? అని ప్రశ్నించారు. ట్రాన్స్ఫార్మర్ల కొను గోళ్లలోనూ కోట్ల రూపాయల అవినీతి జరిగింది. రూ.60 వేల విలువ గల ట్రాన్స్ఫార్మర్‌ను జగన్ రూ.1.30 లక్షలకు, చంద్రబాబు రూ.1.40 లక్షల కు కొనుగోలు చేశారు. ఇది స్పష్టమైన దోపిడీ'' అని ఆరోపించారు. సిపిఎంఎల్ నాయకులు ఆర్. మోహన్ మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి భూములు అప్పగించేందుకు కరేడు గ్రామాన్ని పోలీసులతో అష్టదిగ్బంధనం చేయించడం ప్రభుత్వ తంతు అని దుయ్యబట్టారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్ కోసం పనిచేస్తున్నాయని, వీరి విధానాలపై వ్యతి రేకంగా ఐక్య ఉద్యమాలు సాగాలన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె.మాబు మాట్లాడుతూ దేశంలో మొదటి విద్యుత్ సంస్కరణల ప్రయోగశాల ఆంధ్రప్రదేశ్ అన్నారు. 25 ఏళ్ల క్రితం 9 వామపక్ష పార్టీలు చేపట్టిన పోరాటం ఫలితంగా 20 ఏళ్ల పాటు విద్యుత్ జోలికి ఏ ప్రభుత్వం పోలేదని, ఇప్పుడు మళ్లీ అదే చరిత్ర పునరావృతమ వుతుందని గుర్తుచేశారు.సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూరాష్ట్ర ప్రభు త్వం ఆరు రకాల విద్యుత్ భారాలు మోపిందని. ప్రజలను దోచుకోవడమే అజెండా అని ఆరోపించా రు.తొలుత సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె.మాబు నేతృత్వంలో మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, నాయకులు నల్లూరి మురళి, ముత్తని అంజయ్య ఉప్పుటూరి ప్రకాశరావు, యం.ఏ.సలార్,ఏ. ఐ.వై. యఫ్ రాష్ట్ర అధ్యక్షులు యుగంధర్,ఏ.ఐ. యస్. యఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. రమేష్, జిల్లా కమిటీ సభ్యుల వి.బాలకోటయ్య, కె.రమాదేవి, సీనియర్ నాయకులు పమిడి వెంకట్రావు, సిపిఐ ఎం ఎల్ నాయకులు ఎస్ లలిత కుమారి, న్యూ డెమోక్రసీ నాయకులు బి పద్మ, ఎల్ రాజశేఖర్, సిపిఎం నాయకులు జి శ్రీని వాసులు తంబి శ్రీనివాసులు, టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకం రద్దుకు వ్యతిరేకంగా పోరాడండి

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: పత్తి దిగుమతులపై దిగుమతి సుంకం కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది,పత్తి పంట దిగుమతులపై దిగుమతి సుంకం రద్దు చేయడం అంటే పత్తిరైతు ల ప్రయోజనాలపై గొడ్డలి వేటు వంటిదని ఎస్కేయం జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు కేంద్ర ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి దిగుమతులపై రద్దు చేసిన దిగుమతి సుంకాలు పునరు ద్ధరించాలని,పత్తి పంట క్వింటాలకు 10,075 రూపాయలు నిర్ణయించి, అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు.స్థానిక పట్ట ణంలోని కామ్రేడ్ మాదాల నారాయణస్వామి స్మారక భవన్ లో సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లా డుతూ పత్తి పంట దిగుమతులపై సుంకాలు రద్దు ను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ కేంద్ర రైతు సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు మార్కాపురం డివిజన్, దర్శి నియోజకవర్గంలో తా ళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో నూ ఆగస్టు 30,31వ తేదీల్లో ప్రచా రం చేయాలని సెప్టెంబర్ 1వ తేదీ మార్కాపురం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నాచేయాలని, ఒంగోలు కలెక్టరేట్ ముందు సెప్టెంబర్ 2వ తేదీ ధర్నా చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం నిర్ణయం చిందని తెలియజేశారు. మార్కాపు రం,ఒంగోలులో జరిగే ధర్నా కార్యక్ర మాలను జయప్రదం చేయాలని రైతు లకు పిలుపునిచ్చారు, ఈ సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎల్బీజీ భవన్ జిల్లా అధ్యక్షు లు దుద్దూరి జయంతి బాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి, అఖిల భారత రైతు -కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే హను మంత రావు, ఇఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి, బాల కోటయ్య, అఖిలభారత రైతు- కూలీ సంఘం జిల్లా నాయకులు ఎన్. హను మంతరావు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు పరిటాల కోటేశ్వరావులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పాఠశాలలకు సమయం ఏది..?

- ❑ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?
- ❑ బాలింతలు,గర్భిణీల బాధ్యత పట్టదా
- ❑ అధికారుల తనిఖీలు అంతంత మాత్రమేనా

విశాలాంధ్ర- వెలిగండ్ల: మండలంలోని పిఎన్వరం అంగన్వాడి పాఠశాల 11 గంటలు సమయానికి కూడా పాఠశాలు తెరుసుకోకపోవడంతో మండలంలో దాదాపుగా అన్ని పాఠశాలల ఇదే పరిస్థితి కొనసాగుతుంది కొంతమంది అయితే కనిగిరి నుంచి వెలిగండ్ల అంగన్వాడి పాఠశాలలకు వెళుతున్నారు ఇక వారి కంటూ సమయం ఏమీ ఉండదు రాజకీయ నాయకులు అండదండలతో ఇష్టం వచ్చినప్పుడు పాఠశాలలను తీయడం అదీ కాకపోతే ఆయాలను పాఠశాల నందు ఉంచడం ఎవరైనా పాఠశాల వద్దకు చేరుకొని అంగన్వాడీ కార్యకర్త ఎక్కడికి వెళ్లారని ప్రశ్నిస్తే ఇప్పుడే మండల కేంద్రానికి వెళ్లారని రకరకాల సమాధానాలు చెబుతూ విషయాన్ని దాటవేస్తారు ఈ లోపుగా అక్కడికి ఎవరు వచ్చారు అని కనుక్కొని రాజకీయ నాయకులు ద్వారా వారికి ఫోన్లు చేసి మా పాఠశాలలో వదిలేయండి అంటూ వారి దగ్గర నుండి సమాధానాలు పంపిస్తారు దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి పాఠశాలల్లో కార్యకర్తలు సమయపాలన పాటించకపోవడం ఉన్నతాధికారులు గ్రామీణ ప్రాంతాల పాఠశాలలపై దృష్టి సారించకపోవడం గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం ఇవ్వాలని ప్రభుత్వం మాత శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటుచేసిన ఈ అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని గ్రామస్తులు ప్రజలు విశ్లేషిస్తున్నారు.

వెంగమాంబ దేవస్థానానికి ఫ్రీజర్ బహుకరణ

విశాలాంధ్ర-పామూరు : ఒంగోలు జిల్లా ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆగుపాటి ఆకుపాటి వెంకటేష్ కుమారుడు నోహిత్ జన్మదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన నర్రవాడ వెంగమాంబ అమ్మవారి దేవస్థానానికి వాటర్ ఫ్రీజ్ బహుకరణ బుధవారం చేశారు. మాధవ , సాయి బ్రహ్మం , చెన్న , వినోద్ , రాజశేఖర్ , చెన్నయ్య , లక్ష్మణ్, సాయి, చందు, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కురుగుంట్ల ఆశాలత మెమోరియల్
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని కొండెపి రోడ్ లో గల నూతనంగా నిర్మించిన కురుగుంట్ల ఆశాలత మెమోరియల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ముఖ్య అతిథులుగా విచ్చేసిన దామచర్ల సత్య ప్రారంభించారు. నూతన ప్రారంభం సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య పరీక్షలు 28 నుండి 31 వరకు ఉచితంగా చూస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి పోతుల నరసింగరావు మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు విశిష్ట అతిథులుగా హాజరు కాగా కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: తహసీల్దార్

విశాలాంధ్ర-దొనకొండ: యూరియా అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవంటూ తహసీల్దార్ బి.రమాదేవి హెచ్చరించారు. దొనకొండలోని ఎరువుల దుకాణాలను ఆమె మండల వ్యవసాయాధికారి వి.బాలక్రిష్ణనాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో యూరియా నిల్వలను, ధరలను పరిశీలించి దుకాణదారులుకు పలు సూచనలు చేశారు. యూరియాను పక్క మండలాలకు తరలించినా, అధిక ధరలకు అమ్మినా దుకాణాల లైసెన్స్ రద్దుతో పాటు పలు చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అధిక ధరలకు అమ్మినా, పక్క మండలాలకు తరలించినట్లు తెలిసినా వెంటనే వ్యవసాయాధికారి తెలియజేయాలంటూ రైతులకు ఆమె సూచించారు. ఎరువులు, క్రిమి సంహారిక మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రశీదు తప్పక పొందాలన్నారు. ఆమె వెంట ఏఓ బాలక్రిష్ణనాయక్, హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు గాయాలు

విశాలాంధ్ర-పీసీపల్లి : ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో గ్రామ వ్యవసాయ సహాయకులకు గాయాలైన ఘటన మండలంలోని పెద్ద అలవలపాడు పంచాయతీ పరిధిలోని పంచలింగాలకొండ సమీపంలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే పొన్నలూరు మండలం కే అగ్రహారం భోగనంపాడు రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సచివాలయ ఉద్యోగులు పొన్నలూరు నుంచి పెద్ద అలవలపాడు వైపుకు వస్తుండగా పొన్నలూరు మండల అగ్రికల్చర్ ఏవో పొన్నలూరు నుంచి కారులో కనిగిరి వెళుతుండగా పంచలింగాలకొండ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు గ్రామ వ్యవసాయ సహాయకులకు గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న స్థానికులు 108కు సమాచారం అందించారు. గాయపడిన ఇద్దరు సచివాలయ ఉద్యోగులను కనిగిరి ఏరియా ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

ఇంకుడుగుంటలు నిర్మాణాలు పూర్తి చేయాలి

మండల ప్రత్యేక అధికారి సువార్త

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని కాట్రగుంట వద్దిమడుగు తువ్వపాడు కొనకనమిట్ల నాగరాజు కుంట సిద్దవరం గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కొనకనమిట్ల మండల ప్రత్యేక అధికారి సిహెచ్ సువార్త అన్నారు. గురువారం మండలంలోని కాట్రగుంట పంచాయతీలో జరుగుతున్న ఇంకుడు గుంటలు నిర్మాణపనులను పరిశీలించారు. ఆ పనులపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం కాట్రగంట సచివాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను హాజరు పట్టికలను పరిశీలించారు .డైపిస్ట్ కంప్యూటర్ ఆపరేటర్కు ఈపి టి ఎస్ పై అవగాహన కల్పించి, సచివాలయ సిబ్బందికి సూచనలు సలహాలు చేశారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో కే శ్రీనివాసరెడ్డి ఏపీ ఓ బులెన్నరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అర్హత ఉన్న ప్రతి ఒక్క వికలాంగుడికి పెన్షన్ మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మ రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి అనుబంధ సంఘం గా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గం లో స్థానిక పోలీసు స్టేషన్ దగ్గర నుండి డా.బి. ఆర్ అంబద్కర్ విగ్రహం దగ్గరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి బ్యానర్ తో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య మాట్లాడుతూ ఇటీవల రీ అసెస్ మెంట్ తొలగించిన అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని, అలాగే రీ అసెస్ మెంట్ లో రియల్ వికలాంగులకు గతంలో ఇచ్చిన సర్టిఫికెట్ లో ఉన్న వికలత్వ శాతం తగ్గించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజక వర్గ అధ్యక్షులు పోలేపల్లి పెద్ద పాలంకయ్య, యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కణమాల కోటేశ్వరరావు, డి.పరం జ్యోతి,కే. శ్రీను, బి.బ్రహ్మ రెడ్డి,టి. వెంకటేశ్వర్లు, ఎస్కే నాసర్ వలి తదితర వికలాంగులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ విద్యుత్ అమర వీరులకు జోహార్లు

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులో బషీర్‌బాగ్ విద్యుత్ అమర వీరులకు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2000,ఆగస్టు 28 వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో విద్యుత్ భారాలు ఆపాలని పెద్ద పోరాటం, ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ పై అప్పటి టీడీపీ చంద్రబాబు ప్రభుత్వం కాల్పులు జరిపించి ముగ్గురు ప్రాణాలు తీసింది. రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలు పోలీస్ తుటాలకు బలైపోయారు. టంగుటూరు లో ఈ అమర వీరుల చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించటం జరిగింది. జగన్ ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి అని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచి, స్మార్ట్ మీటర్లు బిగించటం దుర్మార్గం అని అన్నారు. బషీర్ బాగ్ అమర వీరుల పోరాట స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటం నడిపి, ప్రజలపై భారాలు మోపుతున్న ఈ కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని నాయకులు హెచ్చరిక చేస్తూ ప్రతిజ్ఞ చేయటం జరిగింది. సిపిఎం నాయకులు టీ. రాము, వేసుపోగు మోజెస్, ఎమ్. యానాది, జి. సాల్మన్, వెంకటేశ్వర్లు, డి. తిరుమలరావు, కోదండరాం, కె. శ్రీనివాస్, సురేష్, సిపిఐ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణనాధుడి ఉత్సవాలు నిర్వహించుకోవాలి: ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర - గిద్దలూరు : ప్రశాంత వాతావరణంలో గణనాధుడి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం ప్రశాంతి నగర్ లో గణనాధుని పూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అష్టైశ్వర్యాలను కలిగించే వైరంతో విరోధ భావంతో కాకుండా విగ్రహ పరిధిలో ఉండే అందరూ కలిసిమెలిసి దైవిక భావం తో జరుపుకోవాలని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య, రిటైర్డ్ ఎంఈఓ తిరుమల రావులు పాల్గొన్నారు.

రామగోపాలపురం, మోటుపల్లెల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర- వెలిగండ్ల : మండలంలోని రామగోపాలపురం, మోటుపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి తమ్మినేని శిల్ప మాట్లాడుతూ ప్రతి రైతు పంట వేసిన తర్వాత ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని అలానే ఈ పంట యొక్క ప్రాముఖ్యత గురించి తెలిపారు, క్రాప్ ఇన్సూరెన్స్ (ప్రధానమంత్రి ఫసల్ భీమాయోజన) లో ఆరు పంటలకు మన జిల్లాలో నోటిఫైడ్ క్రాప్స్ కింద ఇచ్చారు. కంది, సజ్జ, మినుము, వరి, ఎర్ర మిరప, పంటలకు నోటిఫైడ్ క్రాప్స్ కు ప్రీమియం కట్టుకోవచ్చని రైతులకు తెలిపారు. రైతు కట్టవలసిన ప్రీమియం ఈ పంటలకి ఈ నెల 31 వ తేదీ వరకు గడువు పొడిగించారు అని తెలిపారు. వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్, ద్వారా 21 మందికి రూ. 8,94,513లు, ముగ్గురికి ఎల్ఓసీ ల ద్వారా రూ. 9,00,000లు మొత్తం 17,94,513ల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఆపదలో అండగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయ నిధి అని, ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయాన్ని మరువకూడదని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకి ధన్యవాదములు తెలిపారు. టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలను సందర్శించిన 'దద్దాల'

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి నియోజకవర్గం వైయస్సార్ సిపి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ కనిగిరిలోని పాత కూచిపూడిపల్లి, తాళ్లూరి కళ్యాణ మండపం వద్ద అలాగే పట్టణంలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుని ఆశీస్సులతో చేసే ప్రతికార్యం విజయవంతం కావాలని, విఘ్నాధిపతి నియోజకవర్గం ప్రజలందరి విఘ్నాలను తొలగించి వారి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని ప్రార్ధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని మండపాల కమిటీ సభ్యులు ఇంచార్జ్ దద్దాల నారాయణను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్ రెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, గాంధ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, సూరసాని నరసారెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, పలుకూరి భాస్కర్, బచ్చు వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, యర్రం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, దరిశి ఫణి కుమార్, మిట్ట రమేష్ రెడ్డి, తూము వెంకటకృష్ణారెడ్డి, మార్తాల వెంకటేశ్వర్ రెడ్డి, పీకేపి యూత్ తమ్మనేని రాజశేఖర్ రెడ్డి, తమ్మినేని చంద్రశేఖర్ రెడ్డి, కర్నాటి ప్రశాంత్ రెడ్డి, దేవిరెడ్డి గురుకృష్ణారెడ్డి, తమ్మనేని నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : వినాయక చవితి పండుగను మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు గ్రామాలలో 94 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం వేకువ జాము నుంచే వివిధ గ్రామాలలోని దేవాలయాల్లో ఆది దేవునికి తమ విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ఎల్ఐసి ఎండి ఆర్ టి క్లబ్ మెంబర్ కంకణాల చలపతిరావు, రావెళ్ల అజిత కుమారిలు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పూజారి దుర్గా కులనగేష్ శర్మ వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు.

ఆధునిక యంత్రాలతో లాభదాయకమైన వ్యవసాయం

విశాలాంధ్ర - గిద్దలూరు : మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయంలో ఆధునిక యంత్రాలతో లాభదాయకమైన దిగుబడి తో వ్యవసాయాన్ని పండుగ చేయవచ్చని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. దిగువమెట్ట తాండ గ్రామంలో శ్రీ రామ కిసాన్ డ్రోన్ ఎఫ్. యం. బి గ్రూప్ కి వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం సబ్సిడీ పై పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక, సాంకేతిక అభివృద్ధితో వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులకు అందుబాటులోకి తీసుకొని వస్తుంది. సాగులో సమయం, కూలీల కొరత, పెట్టుబడి ఖర్చులు తగ్గించడానికి డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్, గిద్దలూరు బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ సభ్యులు, గిద్దలూరు బుడత మధుసూదన్, వ్యవసాయ పరపతి సంఘం సంజీవ రావుపేట చైర్మన్ రామసుబ్బయ్య, నాయకులు ప్రతాప్ రెడ్డి,మార్తాల సుబ్బా రెడ్డి, రామ సుబ్బారెడ్డి, ఇంచార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. రాజ శ్రీ, వ్యవసాయ అధికారులు విజయ భాస్కర్ రెడ్డి, మహబూబ్ భాష, అబ్దుల్ రఫీక్, జక్కం మేర్సీ, యూనియన్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ పృథ్వి నాథ్, , రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరం ఆగస్టు 28 న జరిగిన పోరాటంలో అమరులైన విద్యుత్తు అమరవీరులకు సీపీఐ ఆధ్వర్యంలో యర్రగొండపాలెంలోని పూల సుబ్బయ్య విగ్రహం దగ్గర ఘనంగా నివాళులు అర్పించారు. విద్యుత్ అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిల చిత్రపటానికి సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవి కృష్ణ గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలు ఉపసరించాలని, విద్యుత్ అమరవీరుల ఆశయాలను సాధిస్తామని, కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతామని, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల బాదుడును తగిస్తామని చెప్పి 14 నెలల కాలంలో రూ.15485 కోట్లు భారాలు మోపి ప్రజల నుండి వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం మరల రూ.12,717 కోట్లు భారాల మోపటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైందని ప్రజలపై ఈ భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని అదాని ఇతర కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. విద్యుత్ సంస్కరణలు వెంటనే ఆపేయాలని ఉపయోగం లేని సంస్కరణ వలన ప్రజలపైన భారాలు పడటం తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ట్రూ అప్ సర్ చార్జీల పేరుతో ప్రజల నుండి వసూళ్లను ఆపాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల బిగించి ప్రజలపై మరో బాదుడుకు సిద్ధమవుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను, స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలని పేర్కొన్నారు. యర్ర గొండపాలెం సిపిఎం నాయకులు షేక్ అమీర్ భాష, విద్యార్థి సంఘ నాయకులు ఎస్.కె హిదాయతుల్లా, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు అంజి, కోటేష్, కొండయ్య, నాగులమీరా, ఎం వెంకటయ్య, సాంబశివరావు, వీరయ్య, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సురక్షిత నీరు

విశాలాంధ్ర - గిద్దలూరు : ప్రతి ఇంటికి మంచినీరు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. జల జీవన్ ద్వారా తాగునీటినే ప్రతి ఇంటికి అందించేందుకు దిగువమెట్ట తండాలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి టెంకాయ కాయ కొట్టి ప్రారంభించారు. గత ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని సృష్టిస్తే సూపర్ సిక్స్ తో పాటు పేద ప్రజలందరికీ సామాజిక న్యాయం ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలుగుళ్ళ ప్రతాప్ రెడ్డి, హనుమంత రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, సర్పంచులు కడియం శేషగిరి, కర్నాటి రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ నాయక్, శ్రీనివాస నాయక్, దప్పిలి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ రమణారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు (ఇంచార్జ్) కె. రాజశ్రీ, ఆరు మండలాల వ్యవసాయ అధికారులు విజయ భాస్కర్ రెడ్డి. మహబూబ్ భాష, అబ్దుల్ రఫీక్, షేక్ మొహమ్మద్, శివ గంగ ప్రసాద్, మెర్సీ, ,సిబ్బంది కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర - గిద్దలూరు : తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోని గ్రామస్తులు సమైక్యంగా నిరసన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని తంబళ్లపల్లె గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తుల కథన ప్రకారం గ్రామంలో ఉన్న తాగునీటి సింగల్ ఫేస్ బోర్లు 6 ఉన్నప్పటికీ నీటి ఊట ఆగిపోవడంతో ఉన్న ఒకటి రెండు బోర్లతోటే గ్రామమంతా సర్దుకుంటూ తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఉన్న బోర్లు చెడిపోతే తమ పరిస్థితి ఏంటని ఒకవైపు ప్రత్యామ్నాయంగా నూతన బోరు ఏర్పాటు చేయాలని రెండు సంవత్సరాలుగా అడుగుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇటీవల ఉన్న బోర్ కూడా మరమ్మతుకు గురికావడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని గ్రామ సచివాలయం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. కనీస బాధ్యత వహించాల్సిన సర్పంచి సైతం తనకేం సంబంధం లేదంటూ నేటి సమస్య పరిష్కారానికి చొరవచ్చు కపోవడం పట్ల గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రెండు సంవత్సరాలుగా పనిచేయని బోర్లను మరమ్మతులు చేయాలని ప్రజల కోరుతున్నారు. అటు అధికారులు చెరో చూపుగా ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఆమె ఎవరికీ చెప్పుకున్న ఫలితం లేకుండా పోయిందని నిరసన మార్గం ఎంచుకున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి అనేది అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధిని నిడమానూరు పంచాయతీ సెక్రటరీ కాశీ నాయక్ పేర్కొన్నారు. గురువారం నిడమానూరు గ్రామంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ నాగులుప్పలపాడు ఔట్రిచ్ వర్కర్ ఎం. మల్లేశ్వరి అధ్యక్షత వహించారు . సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి ప్రతి ఒక్కరికి హెచ్ఐవిడ్స్ ఎలా సంక్రమిస్తుంది ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఎటువంటి వైద్య సేవలు అందిస్తుంది . జాతీయ టోల్ ఫ్రీ నెంబర్ 1097 సంప్రదించాలని వారు సూచించారు. ఎస్కే మస్తాన్ వల్లి , వెల్ఫేర్ అసిస్టెంట్ టు డి భవాని ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని వేడుకలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పలు గ్రామాలలో వినాయక చవితి పర్వదినాన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు మండల కేంద్రమైన కొనకనమిట్లలోని స్టేషన్ పల్లెలో రెండు ఉత్తర బజారున ఒకటి ,దక్షిణ బజారున ఒకటి, హరిజనవాడలో ఒక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు .మండలంలోని గొట్లగట్టు, నాయుడుపేట పెదారికట్ల చినారి కట్ల చినమనగుండం, నాగంపల్లి , తువ్వపాడు సిద్ధవరం ,కాట్రగుంట ఇరుసుల గుండం నాగరాజు కుంట తదితర గ్రామాల్లో ప్రత్యేక శ్యామ్యాన్యాలు ఏర్పాటు చేసి ప్రత్యేక మండపాలు ఉంచి మండపాలలో వినాయక విగ్రహ హాలను ఉంచి పూలు పత్రి కాయలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు విఘ్నలను తొలగించి విజయం పదంలో నడిపించు గణేశ చల్లగా చూడు గుండ్రాల్లయ్య అంటూ వేడుకున్నారు పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.పలు. గ్రామాల్లో గురువారం నుంచి గణేశుని నిమజ్జనం చేసేందుకు డి జైలు పెట్టి ఊరేగింపులు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

షాపులో నగదు చోరీ

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : కర్నూల్ గుంటూరు జాతీయ రహదారిలోని శ్రీ శివ బాలాజీ ట్రేడర్స్ షాపులో దొంగలు పడి నగదు చోరీ చేసిన సంఘటన మండల కేంద్రం దోర్నాల లోని కేజీ రోడ్డులో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం మేరకు శివ బాలాజీ ట్రేడర్స్ యాజమానీ పల్లా వెంకటేశ్వర్లు తన షాప్ లో షట్టర్ వేసి ఇంటికి వెళ్ళగా, కౌంటర్‌లో 90,000 నగదు దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేయడంతో వెంటనే ఎస్సై వి మహేష్ క్లూస్ టీమ్ ను పిలిపించి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఎస్సై వి మహేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్లపై వైసీపీ అసత్య ప్రచారాలు

- రూ.33 వేల కోట్లతో 65 లక్షల మందికి పింఛన్లు
- ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కూటమి అమలు చేస్తోంది
- మంత్రి లోకేష్ హామీ ప్రకారమే మెగా డిఎస్సీతో పోస్టుల భర్తీ
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి : దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల విషయంలో వైసీపీ నేతలు అసత్యాలు చెబుతూ విష ప్రచారం చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో గురువారం మంత్రి గొట్టిపాటి వివిధ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.నిర్మాణం పూర్తి చేసుకున్న రోడ్లను ప్రారంభించారు. ముందుగా జార్లపాలెం-చెరువుకొమ్ముపాలెం తారురోడ్డును రూ.కోటి వ్యయంతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు, అలాగే అద్దంకి-కొణికి రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.అనంతరం 35 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గత 15 నెలల్లో అభివృద్ధి అంటే ఏంటో కూటమి ప్రభుత్వం చూపించిందని పేర్కొన్నారు.జగన్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అమలు చేయకుండా వదిలేశారని ఎద్దేవా చేశారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. దివ్యాంగుల పింఛన్ల విషయంలో అసలైన లబ్ధిదారులకు నష్టం కలిగేలా వైసీపీ నేతలు అసత్యాలతో విష ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు.పింఛన్లపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.కూటమి ప్రభుత్వంలో అర్హులైన దివ్యాంగులు ఎవరికీ పింఛన్లు ఆగలేదని,ఎవరినీ తొలగించలేదని స్పష్టం చేశారు.పింఛన్ల పెంపు విషయంలో రూ.2 వేల నుంచి రూ.3 వేల పెంచడానికి జగన్‌కు 5 ఏళ్లు పట్టిందన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఒక్క సంతకంతోనే రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంచారని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి రూ.33 వేల కోట్లతో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ,దీపం,స్త్రీ శక్తి వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

ఏజీపీ రామకోటయ్యకు సత్కారం

విశాలాంధ్ర - సంతమాగులూరు : అద్దంకి కోర్టులో ఏజీపీగా సీనియర్ న్యాయవాది బత్తుల రామకోటయ్యను ప్రభుత్వం నియమించింది.ఈమేరకు ఆయన న్యాయ శాఖ కార్యదర్శి ప్రతిభాదేవి నుంచి ఉత్తర్వులు అందుకున్నారు.ఈసందర్భంగా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన కూటమి నేతలు కొందరు రామకోటయ్యను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం ఏజీపీకి శాలువా కప్పి,పుష్పగుచ్ఛంతో సన్మానించారు. భవిష్యత్తులోనూ ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.ఏజీపీని కలిసిన వారిలో డీసీ వైస్ ప్రెసిడెంట్ వల్లెం నాసరయ్య,మండల టీడీపీ నేతలు నక్కా వెంకటేశ్వర్లు,తాత్కాలితం దేశింగరాజు,మాజీ ఎంపీటీసీ నక్కా చిన్న సాంబయ్య ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సర్పంచ్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - సంతమాగులూరు : పాతమాగులూరు గ్రామ సర్పంచ్ జిర్రా విజయబాబు అంగన్వాడీ కేంద్రం-2ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సెంటర్లో అందుతున్న మౌలిక సదుపాయాల గురించి టీచర్ జిర్రా కాంతమ్మ, ఆయా సంతమ్మలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని,ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలన్నారు. ప్రతిరోజు కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.అనంతరం చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తూ సరదాగా కాసేపు వారితో గడిపారు.

వీధిదీపాలకు మరమ్మతులు : పాతమాగులూరు పంచాయతీ పరిధిలోని వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ జిర్రా విజయబాబు ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది గురువారం పలు వీధుల్లో వెలగని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.వర్షాలు కురుస్తున్న తరుణంలో కొన్ని చోట్ల అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలను సైతం సరిచేయించారు.దీంతో గ్రామస్థులు సర్పంచ్,విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అమరులకు నివాళి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రెండున్నర దశాబ్దాల క్రితం విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో బషీరాబాగ్‌లో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో ప్రాణాలర్పించిన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి 25వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు మండల కేంద్రమైన చెరుకుపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో సిపిఐ,సిపిఐ (ఎంఎల్) పార్టీల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, సిపిఐ (ఎంఎల్)నాయకులు మద్రివాడ వెంకట్రావు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమ అమరుల్లారా..ప్రపంచ బ్యాంక్ ఆదేశిత ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన మీ త్యాగాలకు మా విప్లవ జోహార్లు.మీ త్యాగాలను వృధా కానివ్వం మీరు చూపిన సమర మార్గంలో ముందుకు సాగుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న మోదీ-అదాని అనుకూల విద్యుత్ సంస్కరణలు పెరిగిన చార్జీలు,ట్రూ ఆఫ్ చార్జీలు,స్మార్ట్ మీటర్లు ఏర్పాటు వంటి ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటాన్ని కొనసాగిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాసరావు,సిపిఐ (ఎంఎల్)నాయకులు కోటేశ్వరరావు, ఒరుగంటి సూర్య ప్రభావతి,ఆటో యూనియన్ నాయకులు జి.నాగరాజు, ఎం.సురేష్, వై.గోపి,ఎస్.కె బాజ్జి, ఎం. ప్రభాకర్ రెడ్డి,ఎం శ్రీనివాస రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు సాగు నిషేధం

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని ఆరికట్లవారి పాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి పాల్గొని 2025-2026 సంవత్సరా నికి తెల్లబర్లీ, నల్లబర్లీ పొగాకు పంట సాగు , నారు మడులు పెంప కం నిషేధించినట్లు తెలిపారు. రైతు సోదరులు పొగాకు నారుమడులు గాని, పంట సాగు చేయడం గాని చేయవద్దని సాగు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పొలం కౌలుకు తీసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా గ్రామ రెవెన్యూ అధికారులను కలిసి కౌలు కార్డులు పొందాలన్నారు. దీనివల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, సమగ్ర ఎరువుల యాజమాన్యం పద్ధతులు పాటించి అవసరమైన మోతాదులో మాత్రమే ఎరువులు వాడటం వలన రైతు పెట్టుబడి ఖర్చులు తగ్గించు కోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వీరాంజ నేయులు, సాయికృష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరుకు చెందిన కుంచాల శ్రీఓంకార్ వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తున్నాడు. పర్చూరు రోటరీ ఆధ్వర్యంలో విద్యార్థికి రూ.15,000 నగదును రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు రోటరీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబి సదానంద రెడ్డి, కోట శ్రీనివాసరావు, కారుమూడి సుబ్బారెడ్డి, మున్నంగి వెంకటసుబ్బయ్య, పాపోలు వెంకటేశ్వర్లు, కాసా అశోక్ కుమార్, గద్దిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్‌గా అప్పలనేని ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని అన్నంబోట్లవారిపాలెం సహకార సంఘం చైర్మన్‌గా అప్పలనేని నరేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్రకు అడుసుమల్లి సొసైటీ చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మక్కెన శేఖర్ బాబు, పర్చూరు మండల పార్టీ అధ్యక్షులు షేక్ శంషుద్దీన్, మండల పార్టీ కార్యదర్శి కొరిటాల సురేష్,దేవరపల్లి ఎంపీటీసీ కాపు రవిచంద్ర అభినందనలు తెలిపారు.

వైసీపీ మండల అనుబంధ విభాగాలకు అధ్యక్షుల ఎంపిక

విశాలాంధ్ర - సంతమాగులూరు : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సంతమాగులూరు మండల అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించి నట్లు మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు తెలిపారు.ఆ వివరాలు ఇలా ఉన్నాయి.యూత్ వింగ్ గోరంట్ల నాగేశ్వర రావు, మహిళా విభాగం చాగంటి అంజమ్మ,రైతు విభాగం ఓగిబోయిన వీరయ్య,బీసీ సెల్ కొల్లి వెంకటరావు,ఎస్సీ సెల్ సంది పోగు చిరంజీవి,ఎస్టీ సెల్ అడప సుధీర్ కుమార్ (నాని),మైనారిటీ సెల్ షేక్ హుస్సేన్ (హోటల్ బుజ్జి),క్రిస్టియన్ మైనారిటీ సెల్ పులిపాటి కిరణ్,స్టూడెంట్ వింగ్ కొల్లూరి సాంబశివరావు,పంచాయతీ రాజ్ వింగ్ దేవరపల్లి లక్ష్మారెడ్డి,మున్సిపల్ వింగ్ గుంటుపల్లి అనంతయ్య,ఆర్టీఐ వింగ్ దుగ్గసాని సుబ్బారెడ్డి పేర్లు ఖరారు చేసినట్టు చెప్పారు. వాలంటీర్స్ వింగ్ గుంటూరు శ్రీను,గ్రీవెన్స్ సెల్ గంజి ఆంజనేయులు, వాణిజ్య విభాగం శ్రీరామ్ సురేష్, వీవర్స్ వింగ్ చిమట రాంబాబు,వైఎస్ఆర్ టియుసి బి.నాగరాజు,లీగల్ సెల్ సంబుల వెంకట కృష్ణంరాజును నియమించారు.వీరితోపాటు అంగన్వాడీ వింగ్ సజ్జల అనుష,కల్చరల్ వింగ్ పుట్టా బ్రహ్మానాయుడు,సోషల్ మీడియా వింగ్ పెరుమాళ్ళ రాణిరాజు,ఐటి వింగ్ బండి అంజిరెడ్డి, దివ్యాంగుల విభాగం ఎర్రంరెడ్డి భూపాల్ రెడ్డి,డాక్టర్స్ వింగ్ చొప్పా వేలంగి రాజు,ఇంటలెక్చువల్స్ ఫామ్ బోడెపూడి వెంకటేష్,బూత్ కమిటీస్ వింగ్ అబ్బూరి రాఘవ,పబ్లిసిటీ వింగ్ మంద ఎర్రకోటయ్యలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయా విభాగాలకు నూత నంగా ఎంపికైన అధ్యక్షులను పలువురు నేతలు ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. యద్దనపూడి, యనమదల, అనంతవరం,సూరవరపు పల్లె,చింతపల్లి పాడు, గన్నవరం, పోలూరు, పూనూరు,చిలుకూరివారిపాలెం తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలకు భక్తులు ఏర్పాట్లు, భారీగా చేశారు. స్వామి వారికి ప్రతిరోజు ఉదయం,సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.పూనూరు గ్రామంలో,గణేష్ కమిటీ వారు ఏర్పాటు చేసిన బొమ్మ వద్ద అర్చకులు నారాయణ వెంకట సందీప్ దీక్షిత్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డాక్టర్ దాసరి స్వతంత్ర ప్రసాద్ వర్ధంతి

విశాలాంధ్ర - రేపల్లె : లయన్ డాక్టర్ దాసరి స్వతంత్ర ప్రసాద్ ఆరవ వర్ధంతి ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని ఓల్డ్ టౌన్‌లోని రామకృష్ణ విద్యా నిలయంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యా నిలయం కమిటీ సభ్యురాలు దాసరి స్వతంత్ర ప్రసాద్ సతీమణి రూబీ లక్ష్మి కుమార్తెలు కాలారి జ్యోత్స్న,గంజి పూర్ణిమల సహకారంతో పాఠశాలకు ఒక ఇనుప బీరువాను బహుకరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు జి.నాంచారయ్య, కె.జగన్‌మోహన్‌రావు, కృష్ణవేణి, డ్రైనేజీ డిపార్ట్మెంట్ రిటైర్డ్ ఉద్యోగికన్న నటరాజు, ప్రధానోపాధ్యా యురాలు జ్యోతి,పాఠశాల కమిటీ సభ్యులు రఘురాం,శివ శంకర్రావు,పాఠశాల సిబ్బంది తదితరులు కీర్తిశేషులు స్వతంత్ర ప్రసాద్ విద్యా రంగానికి చేసిన సేవలను కొనియాడారు.అందరితో కలిసిమెలిసి ఉండే స్వతంత్ర ప్రసాద్ మాస్టారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని ఆయన ఆరవ వర్ధంతిని పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో జరుపుకోవడం సంతోషకరమని రూబీ లక్ష్మి అన్నారు.పాఠశాలకు బీరువాను బహుకరించిన దాతలను పాఠశాల కమిటీ సభ్యులు,ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాలు

విశాలాంధ్ర-దర్శి : వినాయక చవితి పండుగ సందర్భంగా దర్శి పురపాలక సంఘం మరియు దర్శి మండలం లో 185 ఘనవినాయకుల విగ్రహాలను నెలకొల్పి నట్లు సబ్ ఇన్స్పెక్టర్ మురళి తెలిపారు. దర్శి పట్టణంలో ప్రధానంగా కాకతీయ కమ్మ సంఘం, కాపు సంఘం, ఆర్యవైశ్య సంఘం,వెలమవారి వీధిలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద బుధవారం రాత్రి మహిళలువేసిన కోలాటం ప్రజలను ఆకట్టుకున్నాయి. వెలమ వారి వీధిలోబుధవారం రాత్రి జూపల్లి అచ్చారావు పెద్ద కుమారుడు శ్రీనివాసరావు దంపతులు వినాయకుని పూజ కార్యక్రమంలో పాల్గొనగా పురోహితుడు కలవకలను శేఖర్ పంతులు పూజ కార్యక్రమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. పూజా కార్యక్రమం అనంతరం జూపల్లి ధర్మారావు, ధర్మపత్ని జూపల్లి సురేఖ, కుమార్తె జూపల్లి కావ్య వచ్చినభక్తులకు. ప్రసాద వితరణ పంపిణీ చేశారు. తదుపరి బాలబాలికలకు ఆటల పోటీలు పెట్టి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలు వేసిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది ప్రతి రోజు పాలు సాంస్కృతి కార్యక్రమాలునిర్వహించడం జరుగుతుంది.

బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

విశాలాంధ్ర-సిఎస్ పురం : ఉపాధ్యాయులు నూతన విద్యా విధానానికి లోబడి బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని డైట్ అధ్యాపకులు టి. వి. రామచంద్ర రావు అన్నారు గురువారం డైట్ పరిశీలకులు మండల విద్యాశాఖ అధికారుల బృందం మండలంలోని సిఎస్పురం ఎస్టి, సిఎస్పురం మెయిన్ ప్రాథమిక పాఠశాలలు, సి ఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల రోలు, హాజరు, సిలబస్ , వర్క్ బుక్ లు, అసెస్ మెంట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం అమలు వంటి అన్ని అంశాలు పరిశీలించారు విద్యార్థులు అభ్యాసన స్థాయిలను, ఎఫ్.ఎ వన్ పరీక్షల ఫలితాలను పరిశీలించారు రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెలలో మూడు రోజులపాటు మండలంలోని పాఠశాలలను పరిశీలించడం జరుగుతుందని నివేదికలను నేరుగా రాష్ట్ర కమిషనర్ కి పంపించడం జరుగుతుందని డైట్ పరిశీలకులు టి.వి. రామచంద్రరావు తెలిపారు పాఠశాలల తనిఖీ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు టి వి రామచంద్ర రావు, మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువులకు పోషకాలు అందించాలి

విశాలాంధ్ర -తాళ్లూరు: పశువులకు అన్ని రకాల పోషకాలు అందించే విధంగా గడ్డిని అందించాలని వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. మండలంలోని శివరామపురం , మల్కాపురం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 30,816 పశువులు ఉన్నాయని వాటిని అవసరమైన అన్ని రకాల పోషకాలను ఇస్తే మంచి బాల దిగుబడి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో విఏఏలు రాజేష్ మణికంఠలు పాల్గొని నేపియర్, పారా గడ్డి , సూపర్ నేపియర్ , అంజన్ , అలచంద , పిల్లి పిసర , జనుము , సైలో , సుబాబుల్ , అవిశ , వెల్వెట్ బీన్స్ , లూసెర్న్ , గరిక మొదలగు రకాల గడ్డిని రక రకాలుగా మార్చి ,మార్చి అందించాలని చెప్పారు. ఏఏఎ లు అజ్మీర్ , అశోక్ , మార్కెటింగ్ అసిస్టెంట్ శ్రీనివాస రావు , వి ఆ ర్ ఓ చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

మానంకు సతీవియోగం

విశాలాంధ్ర -తాళ్లూరు: టిడిపి ఒంగోలు పార్లమెంటు కార్యనిర్వాహఖ కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్ సతీమణి మానం సుబ్బా రత్నం (54) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న దర్శి నియోజక వర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ లు మానం రమేష్ ను గురువారం పరామర్శించారు. మనోధైర్యంగా ఉండాలని రమేష్‌కు ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు, మండల పార్టీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర్ రెడ్డి, తాళ్లూరు, ముండ్లమూరు మాజీ అధ్యక్షులు ఓబులు రెడ్డి, సోమేపల్లి శ్రీనివాస రావు, క్లస్టర్ ఇన్చార్జి వెంకట రావు, సొసైటీ అధ్యక్షులు గొంది రమణా రెడ్డి (సమర), వల్లభనేని సుబ్బయ్య, నీటి సంఘం ఉపాధ్యక్షుడు టి శివ నాగి రెడ్డి, ఐ శ్రీనివాస రెడ్డి , నుసుం ఆదినారాయణ , వంగపల్లి నాగేశ్వరరావు, చాట్ల దాని, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

విశాలాంధ్ర - తాళ్లూరు: మండలంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని 16 పంచాయితీలలో 51 విగ్రహాల వరకు ఏర్పాటు చేసి శాస్త్ర యుక్తంగా పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామాలలో భక్తులు ఉభయ దాతలుగా ఉంటూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నారు. బొద్దికూరపాడు బీసీ కాలనీలో ముస్లింలతో కలిసి వినాయక స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ హిందూ ముస్లింల ఐక్యతను చాటుతున్నారు. తూర్పుగంగవరం తో పాటు పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఎస్ఐ మల్లిఖార్జునరావు సిబ్బందితో కలిసి పరిశీలించి సూచనలు చేసారు.

శాంతి,భద్రతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు

డిఎస్పీ పి. సాయిఈశ్వర్ యశ్వంత్

విశాలాంధ్ర-సిఎస్ పురం : మండల కేంద్రమైన సిఎస్పురం పోలీస్ స్టేషన్ ను కనిగిరి డిఎస్పి పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ గురువారం సందర్శించి తనిఖీ చేశారు ఈ సందర్భంగా స్టేషన్లోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు వినాయక చవితి సందర్భంగా నవరాత్రులు నిమజ్జనం ప్రశాంతంగా శాంతి భద్రతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డి.ఎస్.పి సూచించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు దొంగతనాలు నేరాలు జరగకుండా గట్టి నిఘా పెట్టాలని, పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు మండల కేంద్రమైన సిఎస్పురం లోని దొంగతనం జరగకుండా వ్యాపారస్తులను సీసీ కెమెరాలు ఏర్పాట్ల ఏర్పాటు చేసుకునే విధంగా వ్యాపారులకు అవగాహన కల్పించాలని తెలిపారు అనంతరం స్టేషన్ పరిధిలో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్, స్థానిక ఎస్సై ఎం వెంకటేశ్వర్ నాయక్, వెలిగండ్ల ఎస్సై కృష్ణ పావని పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వినాయకుని నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : వినాయకుని నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు సూచించారు. మండలంలోని కనపర్తి గ్రామం పరిధిలో ఉన్న సముద్రం తీరని పరిశీలించి వినాయక నిమజ్జనం ప్రదేశాన్ని ఒంగోలు రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్ బాబు, ఎన్జీ పాడు ఎస్సై రజియా సుల్తానా లతో కలిసి సందర్శించినారు. అంతరం వినాయక నిమజ్జనం ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేసి వినాయక నిమజ్జనం విచ్చేసిన ప్రజలకు ప్రజలకి తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసినారు. అలగే గ్రామంలో గజ ఈతగాళ్ళు పేర్లు తీసుకొని వాళ్లతో మాట్లాడి తీర ప్రాంతాల్లో ఎటువంటి సంఘటన జరగకుండా గమనించమని తెలియజేశారు. అలాగే అవాంఛనీయ సంఘటనలు లేకుండా. భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. వారి వెంట పోలి సిబ్బంది తదితరులు ఉన్నారు.

అర్హులకు అన్నదాత సుఖీభవ

విశాలాంధ్ర-వెలిగండ్ల : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అన్నదాత సుఖీభవ అందుతుందని వ్యవసాయ సంచాలకులు షేక్ జైలుల్లాబ్దిన్ అన్నారు. మండలంలోని వ్యవసాయ అధికారిని టి.శిల్ప అధ్యక్షతన వెలిగండ్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు అన్నదాత సుఖీభవ పై సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సాంకేతిక కారణాలతో ఈ పథకం అందని రైతులు ఈ నెల చివరి వరకు రెవెన్యూ అధికారులను సంప్రదించి సరి చేయించుకోవాలని తెలిపారు.ప్రకృతి విపత్తు సంభవించిన సమయాల్లో భీమా నమోదు చేసుకున్న రైతులకు ఉపయోగంగా ఉంటుంది అన్నారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఈ పంట నమోదు మొదలగు అంశాలపై వివరించారు ఈ క్రమంలో వర్షాకాలం ఉన్నందువల్ల కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి పేరు ఉన్న గొడుగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ యారవ. రమా శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్ బొప్పరాజు.లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి.వెంకటరెడ్డి, కనిగిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు కేలం. ఇంద్ర భూపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కొండు విజయ భాస్కర్ రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మినీగా కాశయ్య, వెన్న రమణారెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోము చౌడారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్ పుల్లయ్య రైతులు పాల్గొన్నారు.

నేలకొరిగిన చెట్టు -స్పందించిన కమిషనర్

విశాలాంధ్ర - గిద్దలూరు : నిత్యము పదుల సంఖ్యలో సంచరించే ప్రజలకు ప్రమాదం తప్పింది. వెటర్నరీ ఆసుపత్రి దగ్గర భారీ చెట్టు గురువారం మధ్యాహ్న సమయంలో హఠాత్తుగా రోడ్డుపై పడింది. నిత్యం జనసంచారం ఉండే ఈ వీధిలో ఆ సమయంలో ఎవరు ప్రజలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు నేలకొరిగి రాకపోకలు ఆగిపోవడం, ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న గిద్దలూరు కమిషనర్ రమణ రావు వెనువెంటనే జెసిబిని తీసుకొచ్చి రోడ్డు కట్టంగా ఉన్న చెట్టును తొలగించారు. దీంతో మధ్యాహ్నం తర్వాత ప్రజల ఇక్కట్లు తొలగాయి. వేగంగా స్పందించిన కమిషనర్ రమణారావును పుర ప్రజలు ప్రముఖులు అభినందించారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : పట్టణంలోని తూర్పు సత్రం దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన అనిత ట్రేడ్ ఫేర్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన,బిజెపి,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాయబ్ రసూల్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ జన్మదిన వేడుకలను గురువారం సాయంత్రం స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్ కటింగ్ లో పాల్గొని నాయబ్ రసూల్‌ను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ అమీర్ బాబు, తెలుగు యువత అధ్యక్షులు అధ్యక్షులు మెంటా నరసింహారావు, ఏఎంసి వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, పిఏసిఎస్ చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ మొబీనా మౌలాలి, నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య, షేక్ హాజీ గౌస్, బండ్ల నారాయణ, ఎం. మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు: తహసీల్దార్

విశాలాంధ్ర నాగులుప్పలపాడు : ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధికధరలకు విక్రయించినా, కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ప్రవీణ్కుమార్ హెచ్చరించారు. ఎరువుల అక్రమ నిల్వలను అరికట్టేందుకు మండలంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటయ్యిందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మద్దిరాలపాడు, నాగులుప్పలపాడులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు రాయితీపై అందజేసే యూరియాను ఎవరూ అక్రమంగా నిల్వ చేయరాదన్నారు. దుకాణదారులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏవో పి, వెంకట్రావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఈదుమూడి, మట్టిగుంట గ్రామాల్లో ఇంకుడు గుంతల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో వినియోగించుకొన్న నీటిని భూమిలోనికి పంపించడం ద్వారా భూగర్భ జలాలను పరిరక్షించవచ్చన్నారు. అదేవిధంగా ఇంకుడు గుంతల ప్రోత్సాహానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రూ.6 వేల నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్కుమార్, ఏవో పి. వెంకట్రావు, ఏపీఎం నరేంద్రకుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు నివాళులు

విశాలాంధ్ర-త్రిపురాంతకం : విద్యుత్ ఉద్యమంలో అమరవీరులు అయిన వారికి వామపక్ష నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం స్థానిక సీపీఐ కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి శ్రీనివాస్, సీపీయం జిల్లా నాయకులు రఘురామ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వున్నా సమయంలో విద్యుత్ సమస్యలపై వామపక్షలు ఉద్యమించడం జరిగింది. ఆసమయంలో అధికారంలో వున్నా తెలుగుదేశం పార్టీ వారిపై లాఠీ ఛార్జి, బాష్పా వాయువు, కాల్పులు జరపడం జరిగింది. ఈ కాల్పులలో బాలకృష్ణ, వెంకట స్వామి, విష్ణువర్ధన్ రెడ్డి మరణించడం జరిగింది.ఆనాడు జరిగిన దాడుల వలనే అనంతరం

జరిగిన ఎన్నికలలో గోర పరాభావం జరిగిందన్నారు.మేము అధికారంలోకి వస్తే ప్రజల కష్టాలు తీరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు 9 రకాల సుంకలతో తీవ్ర ఇబ్బందులకు ప్రజలను గురి చేస్తుందన్నారు.అప్పుడు ఇప్పుడు అధికారంలో వున్నా ప్రభుత్యాలా ప్రధాన లక్ష్యం అదాని వంటి కార్పోరేట్ వ్యక్తులకు ప్రజా ధనాన్ని దోచిపెట్టడమే అన్నారు.గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి స్మార్ట్ మీటర్లను బిగించేందుకు శ్రీకారం కులంలో ప్రయత్నిస్తే వామపక్ష పార్టీలు తిప్పి కొట్టాడం జరిగిందన్నారు. ఇప్పుడు అదే విధంగా తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు, కూటమి ప్రభుత్వాలు బిగించడం జరుగుతుంది తద్వార ప్రజలపై తీవ్ర అదనపు భారం పడుతుంది అన్నారు.వ్యవసాయ భూములకు కూడా స్మార్ట్ మీటర్ బిగిస్తే రైతులు ఆర్థిక సాక్షోభంలో పడతారని గుర్తు చేసారు.ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు బిగించే విధానం మానకపోతే ఉద్యమించాక తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున,పట్టణ కార్యదర్శి కాశీం,సీనియర్ నాయకులు ఆంజనేయులు, పవన్ కుమార్,సీపీయం నాయకులు రాజరామయ్య, నాగమల్లేశ్వరి, రవిచంద్ర,నాగేశ్వ రావు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరుల స్ఫూర్తితో మరో పోరాటం

విశాలాంధ్ర-పామూరు రూరల్ : బషీరాబాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తి తో మరో పోరాటం చేయాల్సిన అవసరం వచ్చిందని, అందుకు ప్రజలు సంసిద్ధులై ఉండాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్‌లు అన్నారు. వామ పక్ష పార్టీలు రాష్ట్రవ్యాపిత పిలుపులో భాగముగా గురువారం స్థానిక మమ్మీ డాడీ సెంటర్ లో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సంస్కరణలలో భాగంగా 2000 సంవత్సరంలో విద్యుత్తు పోరాటాన్ని వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యమంలో పోలీసుల కాల్పులకు ముగ్గురు అమరులు అయ్యారని, 25 సంవత్సరాలు అయిందన్నారు. ఆదాని కంపెనీకి దోచి పెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు, సర్, కస్టమర్ చార్జీలు భారాన్ని ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. అధికారంలో రాకముందు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన ఎన్డీఏ ఓటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు బిగించడం వైసిపి, తెలుగుదేశం పార్టీలు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నాయన్నారు. రెండు పార్టీల విధానాలు ఒకటేనని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకొని భవిష్యత్తులో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శిలు పోతుల ప్రభాకర్, షేక్ ఖాదర్ బాషా, నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి వెంకటేశ్వర్లు. ఎస్ పిచ్చి రెడ్డి ఇస్మాయిల్ మస్తాన్ గౌస్ భాష షేక్ అల్లా భాక్ష్, వజ్రాల సుబ్బారావు, పాలపర్తి మస్తాన్ రావు, గాగిపాటి సూరిబాబు,ఆకుల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు ఒకటవ తేదీన రైతాంగ కోరికల దినం జయప్రదం చేయండి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి గ్రామంలో రైతాంగ దినోత్సవం సందర్భంగా రైతు సంఘం జెండాలు ఎగరవేసి జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వి హనుమారెడ్డి కె. వీరారెడ్డి రైతాంగానికి పిలుపునిచ్చారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధానాల ఫలితంగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకపోయి తీవ్ర సంక్షోభంలో వ్యవసాయ రంగం ఉందని అన్నారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గించడం ఈ సంక్షోభం తలెత్తిందని అన్నారు. రైతాంగం ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా సీటు ప్లస్ 50 ప్రకారం గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని అన్నారు. దేశంలో రైతాంగానికి 2 లక్షల రూపాయల లోపు ఉన్న అప్పులను ఒకసారి రద్దువేసి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలి. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ పథకాలన్నింటినీ అమలు చేయాలి. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు, కౌవులు రైతులకు పదివేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలి. నకిలీ ఎరువులు, పురుగు మందులు,విత్తనాల కంపెనీలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి తద్వారా రైతాంగాన్ని నకిలీల భారీ నుంచి కాపాడాలి. పై డిమాండ్ల సాధన కోసం జిల్లాలోని రైతాంగం సెప్టెంబరు ఒకటవ తేదీన గ్రామ గ్రామాన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జండాల ఆవిష్కరణ చేసి రైతాంగ కోరికల దినాలు జయప్రదం చేయాలని హనుమారెడ్డి, వీరారెడ్డి కోరారు.

కంభంలో నిమజ్జనం

విశాలాంధ్ర-కంభం : వినాయక చవితి సందర్భంగా మూడో రోజు గురువారం స్థానిక శీలం వీదిలో జరిగిన లడ్డు వేలం పాటలో టీడీపి నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు 37 వేలకు లడ్డు పాట పాడికైవసం చేసుకున్నారు. గణేష్ నిమజ్జనంను కంభం చెరువు లోచేసారు. మండలంలోని చిన్న కంభం, కందుల పురం,నడింపల్లి. ఎర్కోట,జంగంగుంట్ల,రావిపాడు, హజరత్ గూడెం గ్రామాల్లోని సుమారు 60కి పైగా నిమజ్జనం చేశారు. బుధవారం చవితి గణపతికి భక్తులు ప్రత్యేక పూజలునిర్వహించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-టంగుటూరు : అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ, ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం టంగుటూరు మండలం, తూర్పునాయుడు పాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో 101 మంది లబ్ధిదారులకు రూ.57.70 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. బిల్ క్లింటన్ పౌండేషన్, టాటా పౌండేషన్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ ఆరోగ్యం చేసి ప్రతి పౌరునికి అవసరమైన వైద్య సేవలను అందించి వైద్య ఖర్చు తగ్గించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు.

గంట వాణిపల్లె బ్రిడ్జిపై నిలిచిపోయిన రాకపోకలు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని గంట వాణి పల్లి వద్ద గురువారం ఉదయం నుండి బ్రిడ్జి పై తీగలేరు వాగునీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గంట వాని పల్లి బ్రిడ్జి పూర్తిగా దెబ్బ తినడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఎప్పటినుండో ఈ బ్రిడ్జి మనుమతులు చేపడుతున్నామని, అధికారులు నాయకులు చెబుతున్నప్పటికీ, ఈ బ్రిడ్జి ఇంత వరకు పూర్తి చేయలేదని, దీంతో ఎప్పుడు వర్షాలు కురిసిన బ్రిడ్జి పై నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని తెలియజేశారు. కనుక అధికారులు నాయకులు స్పందించి ఈ బ్రిడ్జి పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ

ప్రజలు వాపోతున్నారు. అలాగే మండలం లోని పలు ప్రాంతాలలో వాగులు పొంగి పొరాయి. ఈ ప్రాంతంలో చెర్లోపల్లి, గంటా వాణి పల్లి, చెరువులు నిండడంతో ప్రజలు ఆనందంగా ఉన్నారు. శ్రీశైలం రూట్లో తీగలేరు వాగులు పలువురు ఆక్రమించ డంతో, ఆ వచ్చే తీగలేరు వాగు నీరు తారు రోడ్డుపై ప్రవహించి, రోడ్డుపై వెళ్లే వాహనా లకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు వాపోతున్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉండాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పర్యవేక్షణ అధికారులకు ఉండాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం మండలంలోని వెలిగండ్లలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా ఆదేశాల మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన మండలంలో సమావేశం నిర్వహించడంలో భాగంగా బుధవారం వినాయక చవితి సెలవు కావడంతో గురువారం ఈ సందర్భంగా ఎంపీడీవో అధికారులతో మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న పనుల పనితీరు గురించి చర్చించడం జరిగింది. ఈవోపీఆర్డి ఒంగోలు అన్నమ్మ, ఆర్డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ బ్రహ్మయ్య, వెలుగు ఏపిఎం జీవరత్నం, అధికారులు పాల్గొన్నారు.

జంగిల్ క్యాట్‌ను రక్షించిన హసనాపురం గ్రామస్తులు

విశాలాంధ్ర-కొమరోలు : మండలం హసనాపురం గ్రామ ప్రజలు జంగిల్ క్యాట్ ను రక్షించారు. మొదట అచ్చం చిరుత పులి లక్షణాలు ఉన్న జంతువులా భావించిన గ్రామస్తులు చిరుతపులి

పిల్ల అనుకొని పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే ఓ బుట్టలో ఆ జంగిల్ క్యాట్ ను గ్రామస్తులు బంధించి ఉంచగా అటవీశాఖ అధికారులు పోలీసులు గిద్దలూరు అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. అయితే అక్కడ పరీక్షించిన వెటర్నరీ అధికారులు, అటవీ శాఖ అధికారులు అది చిరుత పులి పిల్ల కాదని జంగిల్ క్యాట్ గా నిర్ధారించారు. తోటి జంతువులు జంగిల్ క్యాట్ పై దాడి చేయడంతో అది తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో ఉన్నట్లుగా వెటర్నరీ అధికారులు గుర్తించారు. వెంటనే దానికి వైద్యం అందించి తమ సంరక్షణలో ఉంచుతున్నట్లు అధికారులు అన్నారు. కోలుకున్న అనంతరం జంగిల్ క్యాట్ ను నల్లమల అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశంలోనే ఉంచాలి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గం ఐదు మండలాలను ప్రకాశం జిల్లాలోని ఉంచాలని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇటీవల జిల్లాల పునర్విభజనలో భాగంగా మార్కాపురం నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా వచ్చే మంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఐదు నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లా ఏర్పాటుచేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది కానీ దర్శి నియోజకవర్గ లోని తాళ్లూరు ముళ్ళమూరు దర్శి ప్రాంత ప్రజలకు మార్కాపురం వెళ్లాలంటే ఇబ్బందులు తలెత్తుతాయని కనుక ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఈ నియోజకవర్గాన్ని ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాజకీయ కక్షతో అరెస్ట్

విశాలాంధ్ర-గిద్దలూరు : రాజకీయ కక్షతోనే అక్రమ అరెస్టులు చేస్తున్నారని గిద్దలూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి విమర్శించారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొడ్డంపల్లి గ్రామంలో వినాయకుడి విగ్రహం దగ్గర జరిగిన గొడవలో రాజకీయ కక్ష కోణం కనిపిస్తుంది అన్నారు. వైసిపికి చెందిన పలువురిని అక్రమంగా అరెస్టు చేసి వారి పైన రాజకీయ కక్ష తీర్చుకోవడమే లక్ష్యంగా కనిపిస్తుంది అన్నారు. మండల నాయకుడు బొర్రా కృష్ణ రెడ్డిని అక్రమ కేసులతో అరెస్ట్ చేశారు. గిద్దలూరు మాజీ ఎంపిపి కడప వంశీధర్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, రాచర్ల మండల అధ్యక్షుడు ఏలేం మురళీకృష్ణ, గిద్దలూరు మండల అధ్యక్షుడు బత్తెం ఓబుల రావు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నానో యూరియాతో పంటలకు మేలు

విశాలాంధ్ర - అద్దంకి : నానో యూరియాతో పంటలకు మేలు జరుగుతుంది అని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ అర లీటర్ నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమని, మాములు యూరియా వలన భూమిలో పంటలకు మేలు చేసే మంచి సూక్ష్మ క్రిములు,వానపాములు చనిపోతు న్నాయని, నానో యూరియా పిచికారి చేయడం వలన మందు పంట ఆకు లపై పై పడి సమర్థవంతం గా పనిచేస్తున్నది అని,మందు భూమిపై పడక పోవడం వలన భూమిలో పంటలకు మేలు చేసే జీవులు అభివృద్ధి చెందుతా యని తెలిపారు.మండలంలో ఎరువులు సంవృద్ధిగా ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.మండలంలో పొగాకు సాగు చేయవద్దని సూచించారు.ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు ప్రోత్సహించి తరువాత మొఖం చాటేస్తారని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు చాందిని, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రేమ పెళ్లి చేసిన చల్లా రామయ్య

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : దివ్యాంగులైన బొట్టు గంగాధర్,బడుగు శిరీషలకి వైఎస్ఆర్సిపి దివ్యాంగులు విభాగం జిల్లా అధ్యక్షులు సంచారజాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య దగ్గర ఉండి ప్రేమ వివాహం జరిపించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ దివ్యాంగుడు గంగాధర్ సోదరుడు శ్రీనివాసరావు నీవు వివాహం చేసుకుంటే చంపుతానని అతను గంగాధర్‌ని కొట్టడం జరిగిందన్నారు.ఈ విషయం మా దృష్టికి తెలుపగా వారిని జిల్లా హెడ్ క్వార్టర్‌కు తీసుకువచ్చి వివాహం జరిపించామన్నారు. మేజర్‌లు అయిన దివ్యాంగుల వివాహానికి అడ్డుపడుతున్న వీరిని 2016 దివ్యాంగుల హక్కుల చట్టం 92 యాక్ట్ కింద వారికి రక్షణ కల్పిస్తూ పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రేమ వివాహం చేసుకున్న శిరీష గంగాధర్‌లతో దివ్యాంగుల నాయకులు అందరూ బాపట్ల డిఎస్పీని కలిసి సమస్యను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగుల నాయకులు మల్లెల మౌనిక,షేక్ అమీర్ బాషా,ఎం.నాయక్,ప్రకాష్, ఆసోది రామిరెడ్డి, ఆట్ల శ్రీనివాసులరెడ్డి, జోసఫ్, ఉష, డి.రూబెన్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

జడ్పీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ హెని క్రిస్టినా పుట్టినరోజు సందర్భంగా గురువారం గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమెను నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకుంటూ సంతోషంగా ఉండాలని నర్రా సుబ్బయ్య ఆకాంక్షించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సాంబశివ తెలిపారు. సమావేశానికి చైర్పర్సన్ కట్ట మంగ అధ్యక్షత వహిస్తారనీ ఏజెండాలో పొందుపరిచిన 33 అంశాలతో ఎజెండా సమావేశంలో చర్చిస్తారని, కావున కౌన్సిల్ సభ్యులు కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొనాలని కమిషనర్ కోరారు.

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాలు సెప్టెంబర్ 1వరకు పొడిగింపు

విశాలాంధ్ర - రేపల్లె : డిగ్రీ మొదటి సంవత్సరం ఆన్లైన్ ప్రవేశాలు సెప్టెంబర్ 1వ తేది వరకు పొడిగించడం జరిగిందని స్థానిక ఏబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి రవి చంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాలలో సైన్స్ విభాగంలో బి.యస్సి (కెమిస్ట్రీ), బి.యస్సి (కంప్యూటర్ సైన్స్),బి.యస్సీ (ఫిజిక్స్),బి.యస్సి (జువాలజీ) కోర్సులు, ఆర్ట్స్ విభాగంలో బి.ఎ (హిస్టరి),బి.ఎ (ఎకనామిక్స్),బి.కామ్ (జనరల్), బి.కామ్ (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. కాబట్టి ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు సెప్టెంబర్ 1వరకు ఆన్లైన్ అడ్మిషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకొనుటకు సర్టిఫికేట్స్ తీసుకొని ఆఫీసు వేళలలో కళాశాలను సంప్రదించగలరని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లను ఎదుర్కొందాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల : విద్యుత్ ఛార్జీల వ్యతిరేక పోరాటంలో 2000 సంవత్సరంలో హైదరాబాదులో బషీర్ బాగ్ వద్ద అమరులైె రామకృష్ణ విష్ణువర్ధన్ రెడ్డి బాలస్వామిలస్ఫూర్తితో స్మార్ట్ మీటర్లు రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సింగరకొండ అన్నారు. గురువారం వామపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాల నాయకులతో కలిసి బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో స్మార్ట్ మీటర్లు రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని ప్రతిజ్ఞ చేశారు. సింగర కొండ మాట్లాడుతూ నాటి విద్యుత్ రేట్లు పెంపుకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటంలో హైదరాబాద్ బషీర్ బాగ్‌లో వేలాదిమంది కదం తొక్కి ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారన్నారు. నాడు జరిగిన కాల్పుల్లో రామకృష్ణ,బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి ముగ్గురు పోలీసుల తుపాకి కాల్పులకు బలయ్యారన్నారు. ఆ ఉద్యమ ఫలితంగా సుమారు రెండు దశాబ్దాల పాటు విద్యుత్ చార్జీలు పెరగకుండా ఆగాయన్నారు. నేడు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలకు పాలకులు సిద్ధమయ్యారన్నారు. ఈ విద్యుత్ ఛార్జీల నిలువు దోపిడీని అరికట్టడానికి ప్రజల్ని పెద్ద సంఖ్యలో కదిలించాలని అందుకు వామపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాలను కలుపుకొని ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వీటికి సెల్ ఫోన్ రీఛార్జ్ తరహాలో ముందుగానే డబ్బులు చెల్లించి రీఛార్జి చేసు కోవడంతోపాటు ఒక్కో మీటర్‌కు రూ.30,000 ఖర్చుపెట్టి మీటర్ల బిగించిన అనంతరం ఆ సొమ్ము మన వద్దే వాయిదాల పద్ధతిలో వసూలు చేస్తారన్నారు. ఆదానికి రూ.వేల కోట్లు సంపాదించి పెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి అన్నారు. అందువల్ల ప్రమాదకరమైన ఈ స్మార్ట్ మీటర్ల రద్దు చేసేంతవరకు విద్యుత్ పోరాట అమర వీరుల స్ఫూర్తితో పోరాటం కొనసాగించాలని సింగర కొండ కోరారు. 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచరాదంటూ హైదరాబాదులో ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజలపై బషీర్బాగ్ వద్ద బాష్పవా యువు వదలి, రసాయన నీరు వెదజల్లి తుపాకీ గూళ్ళ వర్షం కురిపించి ముగ్గురిని బలి కొన్నారని వందలాది మంది లాఠీ దెబ్బలకు గురైనారని అయి నా జనం దీక్షతో ఆందోళన చేశారని సింగరకొండ అన్నారు. ఆగస్టు 28 ఆ ఘటన జరిగిందని అందువల్ల ఆస్ఫూర్తితో అమరవీరుల సాక్షిగా పోరాటం కొనసాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి సింగర కొండ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గంగయ్య,సిపిఎం జిల్లా నాయకులు మజుందార్,కొండయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి,బీఎస్పీ నాయకులు రాజారావు, సమాజ్వాది పార్టీ నాయకులు శ్రీనివాసరావు ,సిపిఎం నాయకులు శరత్, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు,భాస్కర్ రావు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ హక్కులను కాపాడుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : రాజ్యాంగ పరిరక్షణ హక్కులను కాపాడు కోవాల్సిన అవసరం మనందరిపై ఉం దని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుళ్లిబిల్లి అశోక్‌బాబు అన్నారు. యద్దనపూడి మండలంలో మాలల ఆత్మీయ సమావేశం,అనంతరం ర్యాలీ నిర్వహించారు. మొదట అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అశోక్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేకము సుప్రీం కోర్టు తీర్పు వ్యతిరేక ఎస్.సి వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం అని చెప్పారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులుదాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ 42 లక్షలు ఓట్లున్న మాలలను వాడు కొని వదిలేస్తున్న ప్రభుత్వాలకు రాజకీయ పార్టీ లకు ఓటుతోనే తగిన బుద్ధి చెప్తామన్నారు.కార్యక్రమంలో మాల ఉద్యో గుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వేంద్రపాటి పరిరక్షణ సమితి సభ్యులు డి.విజయమ్మ, శ్రీనివాసరావు, సాతులూరి భాస్కర్, కుల్లి పిచ్చయ్య, సాతులూరి రమేష్, ఎం.రవి, బి.అశోక్, యద్దనపూడి మాజీ జడ్పిటిసి సభ్యులు బత్తుల శారమ్మ జాన్ నెహ్రూ,పెదభూషణం, గ్రామాలలోని ఎస్సీ,ఎస్టీ,బి.సి, మైనార్టీ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

తెలుగు అకాడమీ శాఖలను అన్ని జిల్లాలో ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సుదీర్ఘ పోరాటాల అనంతరం తెలుగుకు ప్రాచీన భాష హోదా దక్కినప్పటికీ ఆ గౌరవాన్ని నిలుపుకోవడం క్లిష్టతరంగా మారిందని,ఆంగ్ల భాషా వ్యామోహమే అందుకు ప్రధాన కారణమని బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు,రచయిత తిమ్మన శ్యామ్ సుందర్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్ట మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవిర్భవించేందుకు దోహదపడిన తెలుగు భాష మనుగడ ప్రశ్నార్థకంగా మారకముందే భాషాభిమానాన్ని పెంపొందిం చేందుకు క్షేత్రస్థాయిలో కృషి జరగాలని ఆయన కోరారు. పీజీ స్థాయి వరకు తెలుగును ఒక ఖచ్చితమైన పాఠ్యాంశంగా చేరిన నాడే మార్పునకు అవకాశం ఉంటుందని, నేటి తరం విద్యార్థులకు తెలుగు పుస్తక పుస్తకాల పట్ల ఆసక్తి లేక పోవడంతో తెలుగులో తప్పులు లేకుండా చదవలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ తెలుగు అకాడమీ శాఖలను ఏర్పాటు చేసి మాతృ భాష ఆవశ్యకత పట్ల అవగాహన కల్పిస్తే ఈ సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందన్నారు. ముఖ్యంగా తెలుగు తల్లికి జన్మ స్థానమైన బాపట్లలో అకా డమీ తొలి శాఖను ఏర్పరచాలని విజ్ఞప్తి చేశారు.తొలి తెలుగు భాషా మూలాలు కలిగిన బాపట్ల జిల్లా కేంద్రంలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి,అనువాద రచనల ప్రచురణ, గ్రంథాలయాల అభివృద్ధితోపాటు బాల సాహిత్యాన్ని వెలువరించడం ద్వారా భాషను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

విశాలాంధ్ర - అద్దంకి : ప్రమాదకర విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు కేవిల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్తు సంస్కరణలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం అద్దంకి ఆర్టిసి బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపైన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15485 కోట్ల విద్యుత్ ఛార్జీలు భారాలు వేశారన్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో మేము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని పెంచిన చార్జీలను తగ్గిస్తామని ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గించడంలో విఫలం చెందిందన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రం హైదరాబాదులో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు పోరాటం చేశారని ఆ పోరాటాన్ని అణిచివేయాలని అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బషీరాబాద్ పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారని వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ గురువారం విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకిస్తూ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.నాటి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఉసురు పార్టీ శామ్యూల్, ఫ్రూట్స్ వండర్స్ నాయకులు తోట వెంకటేశ్వర్లు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : విస్తరణ శిక్షణ కేంద్రం బాపట్లలో రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురు, శుక్రవారంలో జరగనున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణ ప్రత్యేక టిఓటి ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమానికి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ జిల్లాల ఎంపిడిఓలకి, డిప్యూటీ ఎంపిడిఓల శిక్షణను ఉద్దేశించి విస్తరణ శిక్షణా కార్యాలయ ప్రిన్సిపాల్ డి.వెంకటరావు పలు అంశాలపై ఆయన వివరించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన లో మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుండాలని, పంచాయతీ పురోభివృద్ధి సూచిక 2.0లో వచ్చిన మార్పులను,పిఏఐ లాగిన్ వినియోగించి ఆయా గ్రామ పంచాయతీలు సాధించిన స్కోర్లను పరిశీలించి తక్కువ స్కోర్ సాధించుటకు గల కారణాలను గుర్తించి వెనుకబడిన సూచికలను మేరుగు పడుటకు ప్రజా భాగస్వామ్యముతో అందుబాటులో ఉన్న ఆర్థిక,సామాజిక మానవ వనరులతో పారదర్శకంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకునే విధముగా, అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉండాలని సూచించారు. పంచాయతీ పురోభివృద్ధి సూచికలలో స్పష్టమైన మార్పుతో కూడిన పురోభివృద్ధి తీసుకురావాలని సూచించారు.